ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
కర్ణాటక వార్తలు
శనివారం 4 జనవరి 2025



కలబురగిలో మొబైల్ క్లినిక్ ప్రారంభం

బెంగళూరు, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా మొబైల్ క్లినిక్‌ల ద్వారా మారుమూల ప్రాంతాల్లో వైద్యసేవలు అందించే ఉద్దేశంతో ఏస్టర్ ఆసుపత్రి ఏర్పాటు చేసిన మొబైల్ క్లినిక్‌లను ఉపరాష్ట్రపతి జగదీప్‌ధనకర్ శుక్రవారం వర్చువల్‌గా ప్రారంభించారు. ఢిల్లీలో ప్రారంభించిన మొబైల్ క్లినిక్‌లలో శ్రీనగర్, జమ్ముకశ్మీర్ ప్రాంతాలతోపాటు ఉత్తర కర్ణాటకలో వెనుకబడిన కలబురగిలో సేవలందిస్తామని ఏస్టర్ డిఎం హెల్త్‌కేర్ ఎండీ, సీఈఓ అలీషా మూపెన్, డైరెక్టర్ అనూప్ మూపెన్‌లు ప్రకటించారు.

నిమ్హాన్స్ సేవలు భేష్..!



స్పెషల్‌బ్లాక్‌ను ప్రారంభిస్తున్న రాష్ట్రపతి ద్రౌపదిముర్ము

- మానసిక జబ్బులకు దేశంలోనే ఉత్తమ చికిత్స
- ఆరోగ్యవంతమైన సమాజమే లక్ష్యం: రాష్ట్రపతి ద్రౌపదిముర్ము


బెంగళూరు, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్యవంతమైన సమాజంతోనే సమగ్ర అభివృద్ధి సాధ్యమని రాష్ట్రపతి ద్రౌపదిముర్ము అన్నారు. నిమ్హాన్స్ (నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెంటల్ హెల్త్ అండ్ న్యూరోసైన్స్) స్వర్ణోత్సవాల్లో రాష్ట్రపతి ద్రౌపదిముర్ము ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. శుక్రవారం నిమ్హాన్స్ కన్వెన్షన్ సెంటర్‌లో ఏర్పాటైన కార్యక్రమంలో సీఎం సిద్దరామయ్య, కేంద్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి జేపీ నడ్డా, రాష్ట్ర వైద్య విద్యాశాఖమంత్రి శరణప్రకాశ్ పాటిల్, ఎంపీలు పీసీ మోహన్, డాక్టర్ సీఎన్ మంజునాథ్‌లు పాల్గొన్నారు. నిమ్హాన్స్ వైద్యులు, విద్యార్థులు, అధ్యాపకులు, వృత్తినిపుణులను ఉద్దేశించి రాష్ట్రపతి మాట్లాడుతూ మానసిక ఆరోగ్యం, న్యూరో సైన్స్‌రంగంలో నిర్విరామంగా నిమ్హాన్స్ వైద్యులు సేవలందిస్తున్నారన్నారు. మానసిక ఆరోగ్యసేవలో చరిత్ర సృష్టించిందని ప్రస్తుతం టెలిమనస్ వేదికగా అవసరమైన సలహాలు అందించేందుకు సాంకేతికతను వినియోగిస్తున్నారన్నారు. రెండేళ్లలో దేశవ్యాప్తంగా 53 టెలిమనస్ కేంద్రాలు 17లక్షలమందికి ఎంపిక చేసిన భాషల్లో సేవలందించడం సంతోషకరమన్నారు. గతంలో మానసిక సమస్యలను మూఢనమ్మకాలతో విచిత్రమైన పద్ధతులు పాటించేవారన్నారు. మానసిక ఆరోగ్యంలో నిమ్హాన్స్ తీసుకొచ్చిన చైతన్యం ప్రశంసనీయమన్నారు. మానసిక జబ్బులకు శాస్త్రీయతలేని నమ్మకాలు మచ్చగా ముద్రవేసేవారన్నారు. అయితే నిమ్హాన్స్‌లో అందిస్తున్న వైద్య విధానం దేశంలోనే ఆదర్శంగాను ప్రపంచంలోనే 200లోపు ఆసుపత్రుల్లో ఒకటిగా నిలిచిందన్నారు. రోగులు తమ సమస్యలను సమగ్రంగా తెలిపేందుకు ఇక్కడే సాధ్యమవుతోందన్నారు. వైద్యులతో సమస్యలు చెప్పుకోవడం ద్వారా సగం ఉపశమనం సాధ్యమవుతుందన్నారు. మన ప్రాచీన ఋషులు, సాధువులు పొందిన జ్ఞానం, జీవనపాఠాలు, మనసు సమతుల్యతపై పరిణామం చూపుతుందన్నారు. అందుకే ఆధ్యాత్మిక పరిధిలో మనమంతా అభివృద్ధి చెందామన్నారు. ప్రపంచంలో ఎక్కడా లేనటువంటి మనస్సు మూలమనే మన గ్రంథాలు చెబుతాయన్నారు. ఆరోగ్యవంతమైన మనస్సు మంచి సమాజానికి కారణమవుతుందన్నారు. మానసికమైన జబ్బులబారిన పడినవారికి వైద్యంతోపాటు చైతన్యం, ధైర్యం కల్పించడంలో నిమ్హాన్స్ నిరంతరం కృషి చేస్తోందన్నారు. నిమ్హాన్స్ సంవాద్ వేదికను ప్రశంసించారు. పిల్లలతోపాటు అన్ని వయస్సుల మానసిక ఆరోగ్య సమస్యలను పరిష్కరిస్తోందన్నారు. సమాజంలో ఆరోగ్యకరమైన దాంపత్య విషయాన్ని రాష్ట్రపతి ప్రస్తావించారు. నిమ్హాన్స్‌లో పీజీ, పీహెచ్‌డీలు చేసేవారిలో మహిళలు అధికంగా ఉండడం సంతోషమన్నారు. ఇక్కడ ఏటా 7 లక్షలమందికి చికిత్స అందించడం ప్రత్యేకమన్నారు. నిమ్హాన్స్ చైర్మన్, కేంద్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి జేపీ నడ్డా మాట్లాడుతూ దేశవ్యాప్తంగా సమగ్ర ఆరోగ్యం విషయంలో కేంద్రప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. 50ఏళ్లలో సుదీర్ఘంగా నిమ్హాన్స్ సేవలు స్మరణీయమన్నారు. రానున్న 25ఏళ్లకు నిమ్హాన్స్ అభివృద్ధి కోసం బ్లూప్రింట్ సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. నిమ్హాన్స్ టెలి కన్సల్టేషన్ సేవలను అభినందిస్తూనే ఏటా వెయ్యిమంది శిక్షణ పొందిన విద్యార్థులను ఆరోగ్యసేవలకు నిమ్హాన్స్ పంపుతోందన్నారు.

సీఎం సిద్దరామయ్య మాట్లాడుతూ మానసిక ఆరోగ్యరంగంలో నిమ్హాన్స్ సాధనలు ప్రపంచమంతటా పేరొందిందన్నారు. నిమ్హాన్స్‌తో కలసి పనిచేసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. నిమ్హాన్స్ సేవలకు ఏటా 137 కోట్ల రూపాయలు రాష్ట్రప్రభుత్వం ఖర్చు చేస్తోందన్నారు. కార్యక్రమంలో అంతకుముందు నిమ్హాన్స్ సెంటర్‌లో రాష్ట్రపతి ద్రౌపదిముర్ము సైకియాట్రి స్పెషాలిటీబ్లాక్, సెంట్రల్ ల్యాబొరేటరీ బ్లాక్, బీమా హాస్టల్‌ను ప్రారంభించారు. త్రీడీ ఎంఆర్ఐ స్కానర్, డీఎస్‌ఏ వ్యవస్థను జాతికి అంకితం చేశారు.



విమానాశ్రయంలో రాష్ట్రపతికి స్వాగతం పలుకుతున్న సీఎం సిద్దరామయ్య

సమస్యలున్నా.. ప్రయాణం ఫ్రీ..!





సీఎం సిద్దరామయ్యకు వెంకటేశ్వరస్వామి విగ్రహాన్ని అందజేసి సత్కరిస్తున్న ఏపీ మంత్రులు అనిత, రాంప్రసాద్‌రెడ్డి, గుమ్మడి సంధ్యారాణి

- ఏపీలో ఉచిత బస్సు ప్రయాణం అమలు ఖాయం
- మహిళాశక్తి పెంచడమే చంద్రబాబు ధ్యేయం
- కర్ణాటకలో 'శక్తి'గ్యారెంటీ అమలు అమోఘం
- బెంగళూరు పర్యటనలో ఏపీ మంత్రులు

బెంగళూరు, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లో ఆర్థికంగా సమస్యలున్నా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అందించి తీరుతామని, త్వరలోనే ఈ పథకాన్ని ప్రారంభించేందుకు సీఎం చంద్రబాబునాయుడు నిర్ణయం తీసుకున్నారని ఏపీ రవాణాశాఖా మంత్రి రాంప్రసాద్‌రెడ్డి, హోంమంత్రి వంగలపూడి అనిత పేర్కొన్నారు. కర్ణాటకలో ఏడాదిన్నర కాలంగా అమలు చేస్తున్న ఉచిత బస్సు ప్రయాణం 'శక్తి' గ్యారెంటీ అమలు విధానంపై అవగాహన కోసం మంత్రులు బెంగళూరులో శుక్రవారం ఉదయం నుంచి రాత్రి దాకా పరిశీలించారు. ఉదయం శాంతినగర్ డిపోను సందర్శించి బస్సుల మరమ్మతులు, ఇతరత్రా విధానాలను స్వయంగా పరిశీలించారు. ఆ తర్వాత బీఎంటీసీ బస్టాండ్‌లో బస్సులో ఉచితంగా ప్రయాణించే మహిళలతో ముఖాముఖి జరిపారు. అనంతరం రాష్ట్ర రవాణాశాఖా మంత్రి రామలింగారెడ్డితో పాటు అధికారులు ద్వారా ఏడాదిన్నరగా ఉచిత బస్సు ప్రయాణాలకు సంబంధించిన సమగ్రంగా పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా తెలుసుకున్నారు. సాయంత్రం విధానసౌధలో ముఖ్యమంత్రి సిద్దరామయ్యను కలిశారు. శక్తిగ్యారెంటీకు సంబంధించి చర్చలు జరిపారు.

ఇదే సందర్భంగా మంత్రులు రాంప్రసాద్‌రెడ్డి, వంగలపూడి అనిత, గుమ్మడి సంధ్యారాణి మీడియాతో మాట్లాడారు. ఒక రోజు బెంగళూరు పర్యటనలో ఎన్నో విషయాలు తెలుసుకున్నామన్నారు. కర్ణాటక ఆర్టీసీ సేవలు అభినందనీయమన్నారు. ఏడాదిన్నరగా నాలుగు కార్పొరేషన్‌ల ద్వారా ఉచితబస్సు ప్రయాణాల వివరాలు తెలుసుకున్నామన్నారు. మహిళలు ఆధార్ కార్డు ద్వారా ప్రయాణిస్తే జీరో టికెట్ ఇస్తున్న విషయం గ్రహించామన్నారు. ఇక్కడ ఉచితంతో పాటు భద్రతకు ప్రాధాన్యమిస్తున్నారన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ ప్రకారం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమలు చేసే విషయంలో రాజీ ఉండరాదని సీఎం చంద్రబాబునాయుడు తీర్మానించారన్నారు. అందుకు అనుగుణంగానే ముగ్గురు మంత్రుల కమిటీని ఏర్పాటు చేశారన్నారు. తమిళనాడు, ఢిల్లీలలోను పర్యటించి రెండునెలల వ్యవధిలోనే నివేదిక ఇస్తామన్నారు. ఏపీలో ఆర్థికంగా సమస్యలు ఉన్నా ఉచిత బస్సు ప్రయాణం అమలు చేస్తామన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విడిపోయాక ఏపీకి 11వేల బస్సులు వచ్చాయన్నారు. ఇందులో 7వేల బస్సుల్లో ప్రయాణించేవారికి ఉచిత ప్రయాణం వర్తిస్తుందన్నారు. నెలకు కనీసంగా రూ.280కోట్లు ప్రభుత్వానికి భారం కానుందన్నారు. కానీ మహిళలను ఆర్థికంగా స్థిరపడాలనేది మా ప్రభుత్వ లక్ష్యమన్నారు. హోంమంత్రి అనిత మాట్లాడుతూ మహిళా ప్రయాణికులతో అభిప్రాయాలు తెలుసుకున్నామన్నారు. నెలకు రూ.1100 దాకా బస్సుపాస్‌కు ఖర్చు పెట్టేవారమని, శక్తిగ్యారెంటీ వచ్చాక బస్సు చార్జీ సొమ్ముతో ఇంటికి ఉపయోగకరంగా ఉన్నట్లు తెలిపారన్నారు. దినసరి కూలీలు, కార్మికులు, విద్యార్థులు, మహిళలందరికీ ఇది అనుకూలమని చెప్పారన్నారు. ఒక రోజు పర్యటనలో ఎంతో అవగాహన పొందామన్నారు. రోడ్డుభద్రతకు కర్ణాటక అమలు చేస్తున్న విధానాలపైనా పరిశీలిస్తామన్నారు. ఇక్కడి మంత్రులు, అధికారులు స్పందించిన విధానం హర్షణీయమన్నారు. వారు సాదరంగా స్వాగతించారని పథకానికి సంబంధించి అమలు విధానాలు సమగ్రంగా తెలిపారన్నారు. ఒకరోజు పర్యటనతోనే ఉచితంగా బస్సు ప్రయాణానికి సంబంధించిన అంశాలు తెలుసుకున్నామని, మరో రెండు రాష్ట్రాల్లో పర్యటించి త్వరలోనే నివేదిక ఇస్తామన్నారు.



ఉచిత బస్సు పథకం వివరాలు తెలుసుకుంటూ..

విందుకో.. మరెందుకో..?



- జార్కిహొళి ఇంట నేతలకు రాత్రివిందు
- హాజరైన సీఎం, పలువురు మంత్రులు
- అధిష్ఠానం మందలించినా మరోసారి భేటీ..
- కాంగ్రెస్‌లో కలకలం
- టర్కీ పర్యటనలో డీసీఎం

బెంగళూరు, జనవరి 3(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మరోసారి విందు రాజకీయాలు మొదలయ్యాయి. గ్రూపు విబేధాలు లేవని అంతా సమైక్యంగా ఉన్నామని కాంగ్రెస్ నేతలు తరచూ ప్రకటిస్తున్నా.. మంత్రి సతీశ్‌జార్కిహొళి అధికారిక నివాసంలో గురువారం రాత్రి భారీ విందు జరగడం కాంగ్రెస్‌లో చర్చనీయాంశంగా మారింది. విందులో సీఎం సిద్దరామయ్యతోపాటు పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు భాగస్వామ్యులైనట్టు సమాచారం. అయితే ఇది సాధారణమైన విందు మాత్రమేనని చెప్పుకొంటున్నా ఉన్నఫళంగా విందు ఎందుకు ఏర్పాటైందనేది కుతూహలం రేకెత్తిస్తోంది. మరికొన్ని రోజుల్లోనే మంత్రివర్గ విస్తరణ ఉంటుందని వారం రోజులుగా చర్చలు జరుగుతున్నాయి. మరోవైపు రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి రెండేళ్లు సమీపిస్తున్న తరుణంలో నాయకత్వ మార్పు కూడా జరగవచ్చుననే అభిప్రాయాలు ఉన్నాయి. వీటన్నింటి నేపథ్యంలోనే విందు జరిగినట్లు తెలుస్తోంది. మరోవైపు డీసీఎం డీకే శివకుమార్ టర్కీ పర్యటనలో ఉన్న సందర్భంలోనే విందు ఏర్పాటు కావడం కొత్త చర్చకు కారణమవుతోంది. మంత్రులు మహదేవప్ప, రాజణ్ణ, పరమేశ్వర్, సతీశ్‌జార్కిహొళి పలు సందర్భాలలో అల్పాహారం, విందు భేటీలంటూ కలవడం వివాదమైన విషయం తెలిసిందే. అధిష్ఠానం మందలించడంతో దాదాపు రెండు నెలలుగా వీరి భేటీలు సాగలేదు. కానీ ఉన్నఫళంగా ఎందుకు కలిశారనేది చర్చనీయాంశంగా మారింది. సిద్దరామయ్య అవుట్‌గోయింగ్ సీఎం అంటూ కొందరు వ్యాఖ్యానించినట్లు కూడా తెలుస్తోంది. డీకే శివకుమార్ కూడా ఇటీవల ఆచితూచి వ్యవహరిస్తున్నారు. అధిష్టానం వద్ద ఒత్తిడి తీసుకురావడం ద్వారా అధికారం దక్కించుకోవాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఉన్నఫళంగా అధికార కాంగ్రెస్‌లో సాగుతున్న పరిణామాలతో ఎటువైపు మొగ్గు చూపాలో, ఎవరి తరపున మాట్లాడాలో అనే విషయంలో పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు ఆచితూచి వ్యవహరించాలని భావిస్తున్నారు. ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో ఎవరికి మద్దతు ఇచ్చినా భవిష్యత్తులో అనుకోని పరిణామాలు జరిగితే ఇబ్బందిపడతామని వెనుకడుగు వేస్తున్నట్లు తెలుస్తోంది. ప్రత్యేకించి డీకే శివకుమార్ లేని సమయంలోనే భేటీ కావడం విశేషం.





కళాశాల బ్లూప్రింట్

ఇంజనీరింగ్ కళాశాల నిర్మాణానికి రూ.149 కోట్లు: మంత్రి

చింతామణి, జనవరి 3(ఆంధ్రజ్యోతి): విశ్వేశ్వరయ్య టెక్నికల్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో చింతామణిలో ఇంజనీరింగ్ కళాశాలను నిర్మించేందుకు కేబినెట్‌లో రూ.149కోట్లు పరిపాలనా అనుమతులు లభించినట్టు రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ మంత్రి డాక్టర్ ఎంసీ సుధాకర్ తెలిపారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ పట్టణంలోని కైలాసగిరిరోడ్డులోని కన్నంపల్లి చెరువు వద్ద వీటీయూ నుంచి ఇంజనీరింగ్ కళాశాల నిర్మాణానికి పాలనా అనుమతులు మంజూరయ్యాన్నారు. సీఎం, డీసీఎంలకు మంత్రులకు, తాలూకా ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. కళాశాల మొదటిదశలో 10 ఎకరాలు భూమి, ఇంకా రెండున్నర ఎకరాలకు అనుమతి దక్కిందన్నారు. కొండపై కళాశాల నిర్మాణం అవుతోందని, ఇంజనీరింగ్‌లో ఐదు కోర్సులకు అవసరమైన స్మార్ట్‌క్లాసులు, పాలనా కార్యాలయం, ల్యాబ్‌లు, అధ్యాపకుల విశ్రాంతి గృహాలు, వసతి గృహాలు, బాల,బాలికలకు హాస్టళ్లు ఉంటాయన్నారు. సాధ్యమైనంత త్వరగా నిర్మాణాలు పూర్తి కానున్నాయన్నారు.



పడేసిన టమోటాలను తింటున్న పశువులు

కడుపుకోత.. పశువులకు మేత!

- బళ్లారి ఏపీఎంసీలో టమోటా బాక్సు రూ.50
- పెట్టుబడి కూడా రాదని రైతుల ఆవేదన
- రోడ్లపై పారేసి పోతున్న అన్నదాత

8

న్యూస్ బాక్స్

ఉచిత బస్సు ప్రయాణంపై అధ్యయనం

ఆర్టీసీ జోనల్ చైర్మన్ పూల నాగరాజు



కర్ణాటక ఆర్టీసీ వైస్ చైర్మన్ మొహ్మద్ రిజ్వాన్ నవాబ్‌ను కలిసి పుస్తకాన్ని బహుకరిస్తున్న నాగరాజు

అనంతపురం కల్చరల్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): కర్ణాటక రాష్ట్రంలో అమలవుతున్న మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంపై రాష్ట్ర ప్రభుత్వం అధ్యయనం చేస్తోందని ఆర్టీసీ జోనల్ చైర్మన్ పూల నాగరాజు పేర్కొన్నారు. త్వరలోనే ఇక్కడ కూడా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పిస్తామన్నారు. కర్ణాటక రవాణాశాఖ మంత్రి రామలింగారెడ్డితోపాటు అక్కడి ఆర్టీసీ అధికారులను ఏపీ రవాణాశాఖ మంత్రి రాంప్రసాద్ నేతృత్వంలోని రాష్ట్ర మంత్రివర్గ ఉపసంఘం శుక్రవారం కలిసి అధ్యయనం చేసింది. ఈ బృందంలో నాగరాజు కూడా ఉన్నాడు. రాష్ట్ర ప్రభుత్వంతో మరోసారి చర్చలు జరిపి ఉచిత బస్సు ప్రయాణంపై తుదినిర్ణయం తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు.

తాడిపత్రికి ఎయిర్‌పోర్టు

పరిశీలించాలని అధికారులకు సీఎం సూచన

అనంతపురం జనవరి 3 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని తాడిపత్రిలో ఎయిర్‌పోర్టు ఏర్పాటు నిర్మాణానికి అవకాశం ఉందని, పరిశీలించాలని సీఎం చంద్రబాబు కేంద్ర విమానయాన శాఖమంత్రి రామ్మోహన్‌నాయుడు, ఎయిర్‌పోర్టు ఆథారిటీ ఆఫ్ ఇండియా ఉన్నతాధికారులకు సూచించారు. పెరుగుతున్న అవసరాల నేపథ్యంలో కొత్తగా ఎయిర్‌పోర్టులు ఏర్పాటు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటోంది. ఈక్రమంలోనే శుక్రవారం కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు, ఎయిర్‌పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఉండవల్లిలోని తన నివాసంలో ఎయిర్‌పోర్టులపై సమీక్షించారు. పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతున్న ప్రాంతంగా తాడిపత్రిని గుర్తించిన నేపథ్యంలోనే ముఖ్యమంత్రి తాడిపత్రిలో ఎయిర్‌పోర్టు నిర్మాణం చేయాలనే యోచనలో ఉన్నట్లు తెలుస్తోంది.

జాతీయ చెస్ పోటీలకు జిల్లా క్రీడాకారులు

అనంతపురం క్లాక్‌టవర్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా సామర్లకోటలో ఈనెల 17 నుంచి నిర్వహించే జాతీయ చెస్ పోటీలకు జిల్లా క్రీడాకారులు ఎంపికయ్యారు. ఇటీవల కర్నూలులో నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ చాటిన జిల్లా క్రీడాకారులు సుకృత, రిషిక, మనస్వి మల్లిక, సాయి మనోజ్ కృష్ణలు జాతీయ పోటీలకు అర్హత సాధించారు. ఎంపికైన క్రీడాకారులను జిల్లా చెస్‌కోచ్ రవి అభినందించారు.



జాతీయ పోటీలకు ఎంపికైన జిల్లా చెస్ క్రీడాకారులతో కోచ్ రవి

సాగు...బాగు..!

హంద్రీనీవా, జీబీసీకి పుష్కలంగా నీరు



2023లో జీబీసీకి సాగు నీరు లేక ఎండి పోయిన ప్రధాన కాలువ



హంద్రీనీవా కాలువ కింద ప్రస్తుతం కళకళలాడుతున్న మిరప పంట



ఈ ఏడాది జీబీసీ ప్రధాన కాలువలలో పుష్కలంగా ప్రవహిస్తున్న సాగునీరు

పంటలతో కళకళలాడుతున్న ఆయకట్టు

వైసీపీ పాలనలో నవంబరుకే బంద్

ఫిబ్రవరి దాకా వస్తే గట్టెక్కుతామంటున్న రైతులు

విడపనకల్లు, జనవరి 3(ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం హంద్రీనీవా, జీబీసీల్లో పుష్కలంగా నీరు ప్రవహిస్తోంది. దీంతో ఆయకట్టు భూములు పంటలతో కళకళలాడుతున్నాయి. వివిధ రకాల పంటలు సాగు చేసిన రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. వైసీపీ పాలనలో 2023 నవంబరుకే జీబీసీకి సాగు నీరు బంద్ చేశారు. దీంతో రైతులు ఆగ్రహంతో రోడ్డెక్కి ఆందోళన కార్యక్రమాలు నిర్వహించారు. జనవరి 2024వరకు పోరాటాలు చేసినా అప్పటి ప్రభుత్వం హంద్రీనీవా నుంచి జీబీసీకి చుక్కనీరు కూడా ఇవ్వలేదు. దీంతో మిరప సాగు చేసిన రైతులు పంటను వదిలేశారు. కొందరు రైతులు ట్రాక్టర్ల ద్వారా పంటకు నీరు అందించారు. మరి కొంత మంది బిందెలతోను బక్కెట్లతోను మొక్కలకు నీరు పోసి కాపాడుకున్నారు. అయినా అత్యధిక మంది రైతులు లక్షల్లో పెట్టుబడులు నష్టపోయారు.

9వ కాలువలో నిండుగా నీరు

గడేకల్లు 9వ కాలువకు గత ఐదేళ్ల కాలంలో వైసీపీ ప్రభుత్వం చుక్క నీరు ఇవ్వలేక పోయింది. జీబీసీ ప్రధాన కాలువకు సాగు నీరు వస్తున్నా 9వ కాలువకు సాగునీరు రాక పోవటంతో ఆ కాలువ కింద ఉన్న నాలుగు వేల ఎకరాలు బీడు భూములుగా మారాయి. ప్రస్తుతం 9వ కాలువకు నిండుగా సాగు నీరు వస్తుండటంతో ఆ కాలువ కింద భూములు ఉన్న రైతులు మిరప, కంది, వరి, జొన్న పంటలు సాగు చేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన వెంటనే 9వ కాలువలో పూడికతీత పనులను చేయించారు. దీంతో సాగు నీరు నిండుగా ప్రవహిస్తోంది.

జీబీసీలో 300 క్యూసెక్కుల నీరు

జీబీసీ ప్రధాన కాలువలో ప్రస్తుతం 300 క్యూసెక్కుల నీరు ప్రవహిస్తోంది. పిల్ల కాలువలకు కూడా నీరు సమృద్ధిగా వస్తోంది. దీంతో పొలాల్లోని చిన్న పిల్ల కాలువలకు కూడా నీరు బాగా వస్తోంది. ఒకే సారిఎన్ని సాళ్లకు వదిలినా నీరు పంటకు సరిపడుతోందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ సారి సాగు నీరు ఫిబ్రవరి ఆఖరు వారకు వస్తాయని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం హంద్రీనీవా, జీబీసీ కాలువలకు పూర్తి స్థాయిలో సాగు నీరు వస్తుండటంతో నియోజకవర్గంలోని భూములన్ని పంటలతో కళకళలాడుతున్నాయి. గత ఏడాది సాగు నీరు లేక ఎక్కడ చూసినా ఎండుతున్న పంటలే కనిపించేవి.

పుష్కలంగా నీరు



2023లో నవంబరు నెలలోనే నీరు ఆపేయడంతో సాగు చేసిన మిరప పంటను దున్నేశాము. ఎకరాకు రెండు క్వింటాళ్ల దిగుబడి కూడా రాలేదు. కనీసం ఒక్క తడికి నీరు ఇవ్వండి అని అడిగితే వైసీపీ నాయకులు పట్టించుకోలేదు. ప్రస్తుతం సాగు నీరు కాలువల్లో నిండుగా ప్రవహిస్తోంది. మిరప రైతులకు ఇబ్బంది లేకుండా నీళ్లు వస్తున్నాయి.

– హనుమంతు, మిరప రైతు, కరకముక్కల

బిందెలతో నీటిని పోశాం



నేను 2023లో హంద్రీనీవా పిల్ల కాలువ కింది 8 ఎకరాల్లో మిరప పంటను సాగు చేశా. అయితే సాగు నీరు నవంబరు నెలలోనే బంద్ చేశారు. దీంతో ట్రాక్టర్ల ద్వారా పంటకు నీటి తడులు ఇచ్చా. అయినా పంట దిగుబడి సరిగా రాలేదు. దాదాపు రూ. 10లక్షలు నష్టం వచ్చింది. ఈ ఏడాది హంద్రీనీవాలోను, జీబీసీలోను సాగు నీరు పుష్కలంగా ప్రవహిస్తోంది. అందుకే ఇప్పుడు కూడా హంద్రీనీవా కాలువ కింద మళ్లీ 8 ఎకరాల్లో పప్పుశనగ సాగు చేశా. పంట కూడా ఆశాజనకంగానే ఉంది.

– బొజ్జప్ప, మిరప రైతు, చీకలగురికి



2023లో సాగునీరు రాక ట్యాంకర్ల ద్వారా తడి ఇస్తున్న రైతులు

మొక్క జొన్న సాగు చేశా



జీబీసీకి సాగునీరు రాకపోవడంతో 2023లో ట్యాంకర్ల ద్వారా మిరప పంటకు తడులు అందించాం. అయినా దిగుబడులు రాక తీవ్రంగ నష్టపోయాం. ప్రస్తుతం జీబీసీకి సాగు నీరు పుష్కలంగా వస్తోంది. అందుకే పది ఎకరాల్లో మొక్క జొన్న సాగు చేశా. ఫిబ్రవరి చివరి వరకూ సాగు నీరు వస్తే మంచి దిగుబడి వచ్చి, ధరలు కూడా బాగా ఉండే అవకాశం ఉంది. దీంతో గత ఏడాది జరిగిన నష్టాన్ని కొంతైనా పూడ్చుకునే అవకాశం ఉంది.

– పవన్‌కుమార్, ఆర్ కొట్టాల

ఎస్ఎస్‌బీఎన్ సేవలు ఆదర్శప్రాయం

80వ వసంతోత్సవాలలో వక్తలు



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

అనంతపురం సెంట్రల్, జనవరి 3(ఆంధ్రజ్యోతి): ఎస్ఎస్‌బీఎన్ విద్యాసంస్థలు భావితరాల విద్యార్థులకు ఆదర్శంగా నిలుస్తాయని పూర్వ, ప్రస్తుత ఉపాధ్యాయులు అన్నారు. ఎస్ఎస్‌బీఎన్ కళాశాల ఆవరణంలో విద్యాసంస్థల 80వ వసంతోత్సవాలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు రమేష్‌బాబు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి పలువురు పూర్వ ఉపాధ్యాయులు, విద్యార్థులు హాజరయ్యారు. ముందుగా విద్యాసంస్థల ఫౌండర్ సిరివరం ఆదినారాయణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఎస్ఎస్‌బీఎన్ విద్యాసంస్థల్లో చదివిన విద్యార్థులు దేశ నలుమూలల ఉన్నత స్థానంలో స్థిరపడ్డారని వక్తలు అన్నారు. ఈ విద్యాసంస్థకు సిరివరం ఆదినారాయణ బీజం వేశారని, ఆయన సేవలు ఎనలేనివని అన్నారు. ఆయన నాటిన మొక్క మహావృక్షమై ఎంతో మంది పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తోందని అన్నారు. ఎంతో మంది ఉపాధ్యాయులకు ఉపాధిని కల్పిస్తోందని అన్నారు. వసంతోత్సవాలను నిర్వహించడం, పూర్వ విద్యార్థులు హాజరై విజయవంతం చేయడం చరిత్రలో నిలిచిపోతాయని అన్నారు. శని, ఆదివారాలలో నిర్వహించే జూనియర్ కాలేజీ, డిగ్రీ, పీజీ కళాశాలలో ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ పీఎల్ఎన్ రెడ్డి, కార్యదర్శి నిర్మలమ్మ, కోశాధికారి సుంకు వేణుగోపాల్, కమిటీ మెంబరు ఎస్ఆర్ నాగభూషణం, పూర్వ ఉపాధ్యాయులు సదానందం, శ్రీరాములు, సుధారాణి, ఆంజనేయులు, రోహిణికుమార్, సీతారామశాస్త్రి, శ్రీనివాసులు, హెచ్ఎం సుధామణి, ఉపాధ్యాయులు నాగరాజు, లక్ష్మీనారాయణ, వేణుకోప్రారావ్, రమణారెడ్డి, పద్మావతి, పద్మలత, విద్యావతి, మౌనిక, జూనియర్ కాలేజీ ప్రిన్సిపల్ రామ్మోహన్, యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడాభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల చొరవ

– ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ



విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న ఎంపీ అంబికా

అనంతపురం క్లాక్‌టవర్, జనవరి 3(ఆంధ్రజ్యోతి): క్రీడాభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చొరవ చూపుతున్నాయని అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. కేంద్ర యువజన, క్రీడా శాఖ, నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక ఎస్కే యూనివర్సిటీ క్రీడామైదానంలో జిల్లా స్థాయి క్రీడాపోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు ఎంపీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వర్సిటీ రిజిస్ట్రార్ రమేష్‌బాబు, స్పోర్ట్స్ సెక్రటరీ జెస్సీలు క్రీడా పోటీలను ప్రారంభించారు. కబడ్డీ, వాలీబాల్, ఖో ఖో పోటీల్లో విజేతలకు ఎంపీ బహుమతులు అందజేశారు. ప్రతి ఒక్కరూ పాఠశాల స్థాయి నుంచే క్రీడల పట్ల ఆసక్తి పెంచుకోవాలని సూచించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే సహకారంతో రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో క్రీడాకారులు రాణించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో నెహ్రూ యువకేంద్రం ప్రోగ్రాం ఇన్‌చార్జి శ్రీనివాసులు, రాష్ట్రపతి అవార్డు గ్రహీత బిసాటి భరత్, రెఫరీలు దాదావలీ, రాఘవేంద్ర, సింహాద్రి, రాజారెడ్డి, ప్రగతిపథం యూత్ అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

8న జిల్లాలో కేంద్ర కరువు బృందం పర్యటన

అనంతపురం అర్బన్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది ఖరీఫ్‌లో జరిగిన పంట నష్టంపై అధ్యయం కోసం కేంద్ర కరువు బృందం ఈనెల 8న జిల్లాలో పర్యటించనుంది. జిల్లాలోని ఏఏ మండలాల్లో పర్యటిస్తారన్న షెడ్యూల్ ఖరారు చేయాల్సి ఉంది. షెడ్యూల్ ఖరారు చేసే పనిలో వ్యవసాయ శాఖ అధికారులు నిమగ్నమయ్యారు.

మొక్కవోని ప్రయత్నం

వెయ్యి మొక్కలు నాటిన చిన్నారి నవని



నవనిని అభినందిస్తున్న రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి

అనంతపురం క్లాక్‌టవర్/ కల్చరల్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): రెండో తరగతి చిన్నారి సుంకర నవని పర్యావరణహితం కోసం చేసే ప్రయత్నం అందరినీ ఆకట్టుకుంటోంది. కేంద్ర ప్రభుత్వం పర్యావరణ పరిరక్షణకు ఏక్ పేడ్ మాకి నామ్ పేరుతో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. ఈ కార్యక్రమంపై ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ మీడియా ద్వారా చేసే సూచనలతో నగరానికి చెందిన చిన్నారి నవని స్ఫూర్తి పొంది, మొక్కలు నాటడం ప్రారంభించింది. తల్లిదండ్రులు రమేష్, కల్పన సహకారంతో ప్రభుత్వ కార్యాలయాలు, వివిధ ప్రాంతాలలో ఇప్పటి వరకు సుమారు వెయ్యి మొక్కలు నాటింది. ఈనేపథ్యంలో రాష్ట్ర రాజధాని అమరావతిలో ఆర్‌అండ్‌బీ శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి, వైద్యఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌ను చిన్నారి తన తల్లిదండ్రుల సహకారంతో శుక్రవారం కలిసింది. వారు చిన్నారి సేవాగుణాన్ని అభినంది, సర్టిఫికెట్ అందజేసి, ఆశీర్వదించారు.

టీచర్లకూ ఐదేళ్ల సర్వీసు నిబంధన తేవాలి

అనంతపురం విద్య, జనవరి 3(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల బదిలీల్లో గరిష్టంగా ఐదేళ్ల సర్వీసు ఉండేలా మార్గదర్శకాలు రూపొందించాలని ఏపీ స్టేట్ ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు విజయ్‌భాస్కర్ శుక్రవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు మానవ వనరులశాఖ మంత్రి నారా లోకేష్‌కు లేఖ రాసినట్లు పేర్కొన్నారు. ఒకే స్కూలులో 8 ఏళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న ఉపాధ్యాయులను, 5 ఏళ్ల సర్వీసు పూర్తయిన ప్రధానోపాధ్యాయులను తప్పనిసరి బదిలీలు చేస్తున్నారన్నారు. ఇతరశాఖల్లో ఒకే స్థానంలో 5 ఏళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న వారిని బదిలీ చేస్తున్నారన్నారు. టీచర్లను సైతం 5 ఏళ్ల గరిష్ఠ సర్వీసు నిబంధనను తీసుకురావాలన్నారు.

ట్రేడ్ మార్క్..!

- అవినీతిలో కొత్తదారులు
- ట్రేడ్ లైసెన్స్ ఫీజు చెల్లింపులో టోకరా
- సొంతజేబులు నింపుకున్న కొందరు అధికారులు
- ఏళ్ల తరబడి చెల్లించని మొండి యజమానులు
- నగరపాలికకు రూ.కోట్లలో పేరుకుపోయిన బకాయిలు



త్రిబుల్ ఎస్ బార్ అండ్ రెస్టారెంట్

అనంతపురం క్రైం, జనవరి 3(ఆంధ్రజ్యోతి): నగరపాలిక ట్రేడ్ లైసెన్స్‌లో మాయాజాలం ప్రదర్శిస్తున్నారు. దీంతో నగరపాలిక ఆదాయానికి గండి పడుతోంది. నగరంలో కొన్ని దుకాణాలు, పెద్ద వ్యాపారాలు నిర్వహించే షాపులకు కనీసం ట్రేడ్ లైసెన్స్ ఫీజు కూడా లెక్కించలేదు. దీంతో వారు దర్జాగా వ్యాపారం చేసుకుంటూ కార్పొరేషన్ ఆదాయానికి గండికొడుతున్నారు. నగరపాలికలో ట్రేడ్‌లైసెన్స్ వ్యవహారాలను పబ్లిక్ హెల్త్ విభాగం పర్యవేక్షిస్తుంది. ఇందులో పని చేసే కొందరు అధికారులు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ల గతం నుంచి కూడా చేతివాటం చూపుతున్నారనే ఆరోపణలున్నాయి. తాజాగా విజిలెన్స్ అధికారులు నగరంలోని ట్రేడ్ లైసెన్స్‌ల విషయంలో బకాయిల లెక్కల చిట్టా నగరపాలిక అధికారులకు ఇచ్చారు. ఇక కొన్ని దుకాణాలు ఓ ఫర్మ్ పేరుతో ఏర్పాటు చేసి వ్యాపారాలు జరగక, మరి కొన్ని కారణాలతోనూ వాటిని తొలగించారు. అలాంటి సంఖ్య బాగానే ఉన్నట్లు అధికారవర్గాలు చెబుతున్నాయి. ఇలా బకాయిలు నగరపాలికలో పేరుకుపోయాయి.



నవీద్ రెసిడెన్సీ

నగరపాలికకు రూ.4కోట్ల బకాయిలు

అనంతపురం నగర పరిధిలో 50 డివిజన్లున్నాయి. నగర పరిధిలో ఎలాంటి వ్యాపారం నిర్వహించేవారైనా దుకాణం తీసుకుంటే అందుకు సంబంధించి నగరపాలికకు ట్రేడ్ లైసెన్స్ ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. ఆ మొత్తం ఏడాదికో సారి వసూలు చేస్తారు. ఇందులో మొత్తం 10,060 వరకు అసెస్మెంట్లున్నాయి. వాటి నుంచి ట్రేడ్ లైసెన్సులకు సంబంధించి కార్పొరేషన్ కార్యాలయంలో నమోదు చేశారు. ఇందులో కనీసం చిన్న సైజు గదులున్న కిరాణా దుకాణాల నుంచి హోటళ్లు, ఆసుపత్రులు, బార్లు, రెస్టారెంట్లు ఉంటా యి. చిన్న దుకాణాలైతే కనీసం రూ.1000ల నుంచి పెద్ద వ్యాపార సముదాయమైతే రూ.20వేల వరకు ఉంటాయి. ప్రతి ఏటా రెన్యువల్ చేసుకుంటూ ఆ మొత్తం చెల్లిస్తారు. కనీసం ఒక్కో దుకాణం నుంచి రూ.2వేల ప్రకారం లెక్క వేసుకున్నా ప్రతి ఏటా రూ.2కోట్లు కార్పొరేషన్ ఖజానాలోకి చేరాలి. కానీ ఇప్పటివరకు రూ.4కోట్ల వరకు బకాయిలున్నట్లు అధికారులు నిర్ధారించారు.

జేబులు నింపుకున్న ఘనులు

నగరంలో ట్రేడ్ లైసెన్స్ వసూలు, చెల్లింపు అంతా పారిశుధ్య విభాగం అధికారులే పర్యవేక్షిస్తుంటారు. 2015 వరకు అంతా ఆఫ్‌లైన్‌లోనే ఉండటంతో డబ్బు తీసుకుని కేవలం రసీదులిచ్చేవారు. ఇందులో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, మేస్త్రీలు బాగా చేతివాటం చూపేవారు. దుకాణదారులతో ఒప్పందం చేసుకుని ఎంతో కొంత పుచ్చుకునేవారు. ఆ మొత్తం కార్పొరేషన్‌కు చెల్లించకుండా జేబులో వేసుకునేవారు. రూ.5వేలకుపైగా నే చెల్లించాల్సి ఉన్న వ్యాపార సముదాయా ల నుంచి సగం మాత్ర మే వసూలు చేసేవా రు. 2016 లో ట్రేడ్‌లైసెన్స్‌లన్నీ ఆన్‌లైన్ చేశారు. అ ప్పటి నుంచి కూడా కొందరు గోల్‌మాల్ చేశారనే ఆరోపణలున్నా యి. సచివాలయ వ్యవస్థ ఏర్పాటయ్యాక శానిటరీ సెక్రెటరీలకు అ ప్పగించడంతో ఆ వ్యవహారం చా లావరకు తగ్గినట్లు తెలిసింది. నగరంలో ఏదో ఒక పేరుతో షాపులు తె రిచి ట్రేడ్ లైసెన్స్ చెల్లించని దుకాణాలు నగరంలో 1500 నుంచి 2వేల వరకు ఉన్న ట్లు తెలిసింది. బిజినెస్ ఎక్కువగా జరిగే కమలానగర్‌లోనే 300వరకు ఉన్నట్లు సమాచారం. వీటి నుంచి రూ.80లక్షల ఫీజు రావాల్సి ఉన్నట్లుగా నిర్ధారించినట్లు తెలిసింది.

లైసెన్సే తీసుకోం..

ఏటా రూ.లక్షల నుంచి రూ.కోట్లలో వ్యాపారం చేస్తున్నా కొందరు ట్రేడ్ లైసెన్స్ కూడా తీసుకోరు. శ్రీకంఠం సర్కిల్‌లో నవీద్ రెసిడెన్సీ పేరుతో ఓ లాడ్జి నిర్వహిస్తున్నారు. కొంత కాలం కిందటి వరకు అదే రెసిడెన్సీలోనే హోటల్ కూడా నిర్వహించారు. 15ఏళ్ల నుంచే ఇక్కడ వ్యా పారం జరుగుతోంది. కానీ ఇంతవరకు ట్రేడ్ లైసెన్స్ తీసుకోలేదట. సిబ్బంది వెళితే...రాజకీయనాయకుల పేర్లు చెప్పుకుంటూ చెలామణి అవుతున్నట్లు తెలుస్తోంది. ఇలాంటి వ్యాపార సముదాయాలు నగరంలో 100కు పైగా ఉన్నట్లు సమాచారం. టవర్‌క్లాక్ సమీపంలోని పోలీస్‌కాంప్లెక్స్‌లో దాదాపు 175వరకు దుకాణాలున్నాయి. వీటిలో 10శాతం మాత్రమే అప్పుడప్పుడు ట్రేడ్ లైసెన్స్ చెల్లిస్తున్నట్లు తెలిసింది. ప్రాపర్టీ టాక్స్ ఏమాత్రం చెల్లించని ఈ దుకాణాల నుంచి రెండేళ్ల నుంచి ట్రేడ్‌లైసెన్స్ వసూలు కానట్లు తెలుస్తోంది. ఆర్టీసీ బస్టాండ్ నుంచి గుత్తిరోడ్డుకు వెళ్లే దారిలోని త్రిబుల్ ఎస్ బార్ అండ్ రెస్టారెంట్ పేరుతో ఏకంగా నాలుగు ట్రేడ్ లైసెన్సు లున్నాయట. 2016లో రెండు, అనంతరం మరో రెండు పేర్లతో రిజిస్టర్ చేయించారు. ఇలా మార్చడానికి ముందు తీసుకున్న పేర్ల తో ఎక్కువ మొత్తం చెల్లించా ల్సి రావడం, మరో పేరుతో తగ్గించుకోవడానికే ఇలా చేస్తారని కార్పొరేషన్ వర్గాలంటున్నాయి. అప్పట్లో పనిచేసిన శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, మేస్త్రీల సహకారంతోనే ఇలా చేసినట్లు సమాచారం. ఈ బార్ నుంచి రూ.1లక్షకు పైగా బకాయి ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. కమలానగర్‌లోనే ఓ వస్త్ర వ్యాపారం చేసే నిర్వాహకుడు ట్రేడ్ లైసెన్స్ చెల్లించమంటే ఎవరెవరి పేర్లో చెబుతాడట. 2019 నుంచి 24 వరకు ప్రతి ఏట 50 నుంచి 60శాతం మాత్రమే వసూలవుతున్నట్లు అధికారులు చెబుతున్నారు.



పోలీస్ షాపింగ్ కాంప్లెక్స్

బకాయిలలో కొన్ని...

నగరంలో కొన్ని వేల నుంచి రూ.లక్షల్లో బకాయిలున్నాయి. గ్రీన్ బావర్చీ రెస్టారెంట్‌కు రూ.1.50లక్షలు, అనంతపురం క్లబ్‌కు రూ.1.50లక్షలు, త్రిబుల్ ఎస్ బార్‌కు రూ.1.20లక్షలు, గణేష్ రెస్టారెంట్‌కు రూ.80వేలు, పవర్‌రెస్టారెంట్ హోటల్, గోల్డెన్ తాజ్ హోటల్, విద్యానికేతన్ స్కూల్, పారడైజ్ బార్ రెస్టారెంట్, తిప్పయ్య మోటార్స్, ఎంపైర్ ఫ్యామిలీ రెస్టారెంట్, సాయి డయాగ్నస్టిక్ అండ్ ఫెటల్ మెడిసిన్, రేణుక వైన్స్, విజయ వైన్స్, చరిత వైన్స్, జేకేఆర్ వైన్స్, ఎల్ఎన్ వైన్స్, సాయి తేజ వైన్స్, ఎస్ఎస్ వైన్స్, అనురాధ వైన్స్, క్రాంతి హాస్పిటల్, జేబీ రెస్టారెంట్, బేబీ హాస్పిటల్‌లకు సంబంధించి ఒక్కో దానికి రూ.42వేల నుంచి రూ.60వేల వరకు బకాయిలున్నాయి. వీటిలో కొన్ని వ్యాపార సంస్థలు మార్చేయడం గమనార్హం.

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాంచ్...

సర్ ఐజక్ న్యూటన్ (జయంతి)



గురుత్వాకర్షణ సిద్ధాంతం ద్వారా సైన్స్ పితామహగా పేరొందిన సర్ ఐజక్ న్యూటన్ 1643 జనవరి 4న (పాత క్యాలెండర్ ప్రకారం) యునైటెడ్ కింగ్‌డమ్‌లో జన్మించారు. భౌతిక, గణిత, ఖగోళ శాస్త్రవేత్త. సైన్స్ దృక్కోణంగా వెలుగొందిన యాంత్రిక శాస్త్రానికి, ఆధునిక ఇంజనీరింగ్‌కు ఆయన రాసిన గ్రం థమే పునాది. కెప్లర్ నియమాలకూ, గురుత్వాకర్షణ సిద్ధాంతాలకు సామ్యాన్ని దృష్టాంతంగా చూపారు. లండన్‌లోని రాయల్ సొసైటీ అధ్యక్షుడిగా వ్యవహరించారు. 1727 మార్చి 31న కన్నుమూశారు. మరణానంతరం ఆయన రాసిన పలు రచనలు ప్రచురితమయ్యాయి.

ఆర్‌డీ బర్మన్ (వర్ధంతి)



రాహుల్‌దేవ్ (ఆర్‌డీ) బర్మన్ 1939 జూన్ 27న కోల్కత్తాలో జన్మించారు. ప్రముఖ సంగీత దర్శకుడు సచిన్‌దేవ్ బర్మన్ కుమారుడు. తండ్రి బాటలోనే సంగీతంలో రాణించి జాతీయస్థాయిలో గుర్తింపు పొందారు. 1960-90ల మధ్య 331 సినిమాలకు సంగీత దర్శకత్వం వహించారు. పాశ్చాత్య, లాటిన్, ఓరియెంటల్, అరబిక్ శైలి సంగీతం శైతం అందించారు. భార్య ఆశాభోస్లేతో పాటు కిశోర్ కుమార్, లతా మంగేష్కర్ వంటి గాయకులతో పాటలు పాడించారు. హిందీ సినీరంగంలో తనదైన ముద్రను చాటారు. 3 ఫిల్మ్‌ఫేర్ పురస్కారాలు పొందారు. 1994 జనవరి 4న కన్నుమూశారు.

ఖర్గే రాజీనామా చేసే వరకు పోరాటం: బీజేపీ

దొడ్డబళ్ళాపుర, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): కాంట్రాక్టర్ సచిన్ పంచాళ ఆత్మహత్య వెనుక మంత్రి ప్రియాంక ఖర్గే పాత్ర ఉందనే అనుమానం ఉందని నైతిక బాధ్యత వహిస్తూ ఆయన తన పదవికి రాజీనామా చేసేంత వరకు పోరాటం కొనసాగిస్తామని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి దొడ్డేరి వెంకటేశ్ అభిప్రాయపడ్డారు. శుక్రవారం పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ కాంట్రాక్టర్ డెత్‌నోట్‌లో మంత్రి ప్రియాంక ఖర్గే పీఏ రాజు కపనూర పేరు స్పష్టంగా పేర్కొన్నారని అయినా కూడా పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. మంత్రి పోలీసుశాఖపై ఒత్తిడి తెచ్చి తన పీఏకు రక్షణగా నిలిచారన్నారు. తద్వారా కాంట్రాక్టర్ ఆత్మహత్యకు మంత్రి ప్రియాంక ఖర్గే, కాంగ్రెస్ ప్రభుత్వం నేరుగా బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. రేపు మంత్రి ఖర్గే గుల్బర్గాలోని ఇంటిని ముట్టడించి నిరసన చేపట్టేందుకు పార్టీ సిద్ధమైందన్నారు. ఈ అంశంపై నిరసనకు వచ్చేవారికి కాఫీ, బిస్కట్ ఇస్తామంటూ మంత్రి ఖర్గే నిర్లక్ష్యంగా వ్యాఖ్యానించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మంత్రి రాజీనామా చేసేంతవరకు బీజేపీ పోరాటం ఆగదన్నారు. బెంగళూరు గ్రామీణ బీజేపీ అధ్యక్షుడు రామకృష్ణయ్య మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఒక్కొక్కటే అక్రమాలు వెలుగు చూస్తున్నాయన్నారు. వాల్మీకి కార్పొరేషన్‌లో అవినీతి, ముడా ఇళ్లస్థలాల్లో అక్రమాలు, వక్ఫ్‌బోర్డు వ్యవహారం, బాలింతల మృతి ఇలా వరుసగా వైఫల్యాలు వెలుగులోకి వచ్చాయన్నారు. అవినీతి ప్రభుత్వం తొలగేంతవరకు బీజేపీ పోరాటం చేస్తుందన్నారు. మీడియా సమావేశంలో నగరసభ సభ్యుడు బంతి వెంకటేశ్, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.



మీడియాతో బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి దొడ్డేరి వెంకటేశ్ తదితరులు

కోర్సులకు మౌలిక సదుపాయాలు ప్రారంభం

బెంగళూరు, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): ఆదిత్యకాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీలో ఇసిఇ, సిఎస్ఇ కోర్సులకు మౌలిక సదుపాయాలను, వికసిత భారత్ 2047 దిశగా అడుగులు వేసే కార్యక్రమాన్ని డీఆర్‌డీఓ మాజీ డైరెక్టర్, పద్మశ్రీ డాక్టర్ ప్రహ్లాద రామరావ్ లాంఛనంగా ప్రారంభించారు. ప్రొఫెసర్ సి శివప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు. ప్రహ్లాద రామరావ్ మాట్లాడుతూ వికసిత భారత్ 2047 గురించి ప్రస్తావించారు. ప్రధానమంత్రి దూరదృష్టికి అనుగుణంగా దేశవ్యాప్తంగా అభివృద్ధికి బాటలు సాగుతున్నాయన్నారు. ప్రొఫెసర్ శివప్రకాశ్ మాట్లాడుతూ 5పి అంటే పేపర్, పబ్లికేషన్, ప్రెజెంటేషన్, పేటెంట్, ప్రైజింగ్ ద్వారా విద్యాసంస్థలలో బోధన, పరిశోధనల్లో బలమైన పునాదులు వేయాల్సి ఉందన్నారు. ఆదిత్య గ్రూప్ విద్యాసంస్థలు అధ్యక్షుడు డాక్టర్ బీపీ విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.



జ్యోతిప్రజ్వలన చేస్తున్న డాక్టర్ ప్రహ్లాదరామరావ్

విద్యార్థుల్లో శాస్త్రీయభావాలు పెంచాలి

బెంగళూరు, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులలో శాస్త్రీయభావాలను పెంపొందింపచేయాల్సిన అవసరం ఉందని మంత్రి రామలింగారెడ్డి అభిప్రాయపడ్డారు. నేషనల్ కళాశాలలో సూపర్ నోవా 2.0 పేరిట సైన్స్ ఎగ్జిబిషన్‌ను మంత్రి ప్రారంభించారు. విద్యార్థులు చదువుతున్న పాఠ్యాంశాలలోనే ప్రయోగాలు చేయించే విధానం ప్రతి పాఠశాలలోనూ అమలు చేయాలన్నారు. నేషనల్ కళాశాల ఇటీవల ప్రగతిదిశలో కొనసాగుతోందన్నారు. బీబీఎంపీ కమిషనర్ తుషార్ గిరినాథ్ మాట్లాడుతూ విద్యార్థులు సైన్స్ అండ్ టెక్నాలజీలో ఉన్నతస్థితికి వెళ్లేందుకు అవకాశాలు ఉన్నాయన్నారు. వాటిని సద్వినియోగం చేసుకోవాలంటే నిరంతరశ్రమ అవసరమన్నారు. ఎన్‌ఈఎస్ అధ్యక్షుడు డాక్టర్ హెచ్‌ఎన్ సుబ్రమణ్య, కార్యదర్శి వెంకట శివారెడ్డి, ఉపాధ్యక్షులు వైజి మధుసూధన్‌తోపాటు పలువురు పాల్గొన్నారు.



సూపర్‌నోవా ఎగ్జిబిషన్ ప్రారంభంలో మంత్రి రామలింగారెడ్డి తదితరులు

పెజావరమఠం విద్యాసంస్థకు ఐదులక్షల విరాళం

బెంగళూరు, జనవరి 3(ఆంధ్రజ్యోతి): నగరంలోని కత్రిగుప్పె ప్రాంతంలో పెజావర మఠం ద్వారా విద్యాసంస్థల నిర్మాణాలకు హైకోర్టు న్యాయవాది వేణుగోపాలరావ్ ఐదులక్షల విరాళమిచ్చారు. ఇదే విషయమై దివ్య ఎడ్యుకేషనల్ ట్రస్టు వ్యవస్థాపకులు వేణుగోపాలరావ్ మాట్లాడుతూ కత్రిగుప్పెలో మఠం ప్రాంగ ణంలో నిర్మిస్తున్న విద్యాసంస్థలకు తమట్రస్టు ద్వారా విరాళం ఇచ్చామన్నారు. మఠం ద్వారా ఆధ్యాత్మిక బోధనలతో పాటు విద్యాసంస్థలు, నిరంతరంగా ఆధ్యాత్మిక కార్యక్రమాలు జరుపడం సంతోషకరమన్నారు. అయోధ్యలో రామమందిర నిర్మాణంలో ట్రస్టు సభ్యుడిగా విశ్వ ప్రసన్న తీర్థస్వామీజీ ప్రత్యేక కృషి చేశార న్నారు. స్వామీజీ ఆశీస్సులు పొందేందుకు వెళ్ళిన సందర్భంలోనే విద్యా సంస్థల నిర్మాణాల అంశం ప్రస్తావనకు వచ్చిందని మావంతుగా ట్రస్టు ద్వారా ఐదులక్షలు విరాళమిచ్చామన్నారు.



పెజావర మఠాధిపతి ఆశీస్సులు పొందుతున్న వేణుగోపాలరావ్

అధ్యక్షురాలిగా ద్యావమ్మ ఏకగ్రీవం

శిడ్లఘట్ట, జనవరి 3(ఆంధ్రజ్యోతి): తాలూకాలోని హోసపేట గ్రామ పంచాయతీలో అధ్యక్ష, ఉపాధ్యక్షస్థానాలకు జరిగిన ఎన్నికల్లో జేడీఎస్ మద్దతుదారులు ద్యావమ్మ కెంపణ్ణ అధ్యక్షురాలిగా, శ్వేతహరీశ్ ఉపాధ్యక్షురాలిగా ఏకగ్రీవమయ్యారు. ఈ సందర్భంగా నూతన సభ్యులు రామచంద్రప్ప, మంజునాథ్, రవికుమార్, సౌభాగ్యమ్మ, సుజాత వెంకటేశ్, అనితా, చైత్రలు ఎమ్మెల్యే రవికుమార్‌ను భేటీ అయి కృతజ్ఞతలు తెలిపారు. నూతన అధ్యక్ష, ఉపాధ్యక్షులకు మిఠాయిలు అందించిన ఎమ్మెల్యే అభినందించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రముఖులు కెంపరెడ్డి, గంగిరెడ్డి, కార్తీక్ రాజణ్ణ, గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యేతో నూతన అధ్యక్ష, ఉపాధ్యక్షులు తదితరులు

ఫ్లైఓవర్‌తో తీరనున్న కష్టాలు

రూ.25కోట్లతో నిర్మాణం

రేపు ప్రారంభించనున్న రైల్వేశాఖ మంత్రి

పెనుకొండ, జనవరి 3(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆర్టీసీ డిపో వద్ద రైల్వేగేటుపై కొత్తగా నిర్మించిన ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులు పూర్తికావడంతో వాహనదారుల కష్టాలు తీరనున్నాయి. ఈ రహదారి ద్వారా గతంలో ప్రతిరోజూ వేలాది వాహనాలు రైల్వే ట్రాక్ దాటి వెళ్లేవి. ఈ ట్రాక్‌పై ప్రతి అర గంటకు రైలు లేదా గూడ్స్ వెళ్తుంటాయి. ఆ సమయంలో గేటువేయడంతో ఇరువైపులా వందలాది వాహనాలు నిలిచిపోయేవి. రైలు వెళ్లిన తరువాత వాహనాలు గేటు దాటడానికి అర గంటకు పైగా సమయం పట్టేది. అంతలోపు మరో రైలు రావడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యేవారు. పెనుకొండ మీదుగా 44వ జాతీయ రహదారి ఏర్పడటంతో భారీ వాహనాలు పట్టణంలోకి రాకుండా హైవేపై వెళ్లడంతో రైల్వేగేటువద్ద కొంతమేర వాహనాల రద్దీ తగ్గింది. పట్టణ సమీపంలో కియా పరిశ్రమ ఏర్పడటంతో రైల్వే గేటువద్ద మళ్లీ రద్దీ మొదలైంది. ఇదే సమయంలో రైళ్ల సంఖ్య కూడా పెరగడంతో తరచూ గేటువద్ద రద్దీ పెరగడంతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. వాహనదారుల ఇబ్బందులను గుర్తించి 2019లో కేంద్ర ప్రభుత్వం రూ.25కోట్లతో రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టి ప్రస్తుతం పూర్తి చేసింది. రైల్వే గేటుపై ఫ్లైఓవర్ బ్రిడ్జిని కేంద్ర రైల్వే శాఖ సహాయమంత్రి సోమణ్ణ చేతులమీదుగా ఆదివారం ఉదయం 10గంటలకు ప్రారంభిస్తున్నట్లు హిందూపురం ఎంపీ పార్థసారథి తెలిపారు. ఎన్నో ఏళ్లుగా బ్రిడ్జి నిర్మాణం కోసం ఎదురుచూస్తున్న వాహనదారుల కష్టాలు తీరనున్నాయని పేర్కొన్నారు.

గుంతలు లేని రహదారులే లక్ష్యం : ఎమ్మెల్యే

మడకశిర టౌన్, జనవరి 3(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రతి నియోజకవర్గంలోనూ గుంతలు లేని రహదారులు చూడాలన్న లక్ష్యంతో సీఎం చంద్రబాబునాయుడు ముందుకు వెళుతున్నట్లు ఎమ్మెల్యే ఎంఎస్ రాజు పేర్కొన్నారు. శుక్రవారం అమరాపురం బస్టాండు ఆవరణంలో శ్రీశైలం పుణ్య క్షేత్రానికి మడకశిర నుంచి కొత్త ఆర్టీసీ సర్వీసులను ప్రారంభించారు. టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామితో కలిసి కొత్త బస్సు సర్వీసులను ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ గత వైసీపీ ఐదేళ్ల పాలనలో ఒక్క కొత్త సర్వీసును కూడా ప్రారంభించలేదన్నారు. రవాణా వ్యవస్థను అస్తవ్యస్తం చేశారని, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడేవారని తెలిపారు. మడకశిర నుంచి విజయవాడ, శ్రీశైలం సర్వీసులను నడుపుతున్నట్లు వివరించారు.

అర్హులందరికీ సదరం సర్టిఫికెట్లు : కలెక్టర్

పుట్టపర్తి టౌన్, జనవరి 3(ఆంధ్రజ్యోతి): జిల్లాలో అర్హులైన వికలాంగులందరికి సకాలంలో సదరమ్ సర్టిఫికెట్లు అందించాలని కలెక్టర్ టీఎస్ చేతన్ అధికారులను ఆదేశించారు. నూతన సదరమ్ సరిఫికెట్ల మంజూరు, ఎన్టీఆర్ భరోసా పింఛన్ రూ.15వేలు పొందుతున్న వారి ధ్రువపత్రాల పరిశీలనపై శుక్రవారం కలెక్టర్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. సదరమ్ సర్టిఫికెట్ల కోసం దరఖాస్తు చేసుకున్నవారిలో అర్హులను గుర్తించి సకాలంలో మంజూరు చేయాలన్నారు. మంచానికి పరిమితమై, నడవలేని స్థితిలో ఉన్న పింఛన్‌దారుల సర్టిఫికెట్ల పరిశీలనకు జిల్లాస్థాయిలో వైద్య నిపుణులతో ప్రత్యేక బృందం ఏర్పాటు చేసుకోవాలని ఆదేశించారు. వారానికి మూడురోజులపాటు క్షేత్రస్థాయిలో ధ్రువపత్రాలను పరిశీలించాలన్నారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ శ్రీనివాసరావు, జడ్పీ డిప్యూటీ సీఈఓ వెంకటసుబ్బయ్య, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, డీఎంహెచ్ఓ ఫిరోజ్‌బేగం, డీసీహెచ్‌ఓ తిప్పేంద్రనాయక్, నోడల్ అధికారి సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

• వామ్మో..!

రహదారి.. ఆ పక్కనే లోతైన చెరువును చూస్తుంటేనే ఒళ్లు జలదరిస్తుంది. వాహనదారులు ఏమాత్రం ఏమరపాటుగా ఉన్నా.. చెరువులోకి దూసుకెళ్లడం ఖాయం. చెరువు, రహదారికి ఏమాత్రం దూరం లేదు. కనీసం రక్షణ గోడ లేదు. ఇది ఎక్కడో మారుమూల ప్రాంతంలో కాదు.. జిల్లా కేంద్రం పరిధి ఎనుములపల్లిలోనే. ఎనుములపల్లి చెరువు పక్కనే బైపాస్ రోడ్డు వెళ్తోంది. తారు రోడ్డు, చెరువుకు మధ్య కనీసం మీటరు కూడా మట్టిరోడ్డు లేదు. వాహనదారులు ఏమాత్రం ఏమరపాటుగా ఉన్నా.. అదుపు తప్పి రోడ్డు పక్కనున్న చెరువులోకి పడిపోవడం ఖాయం. రోడ్డు పక్కనే దాదాపు 10 అడుగుల లోతు నీరు ఉంది. రక్షణ గోడలేకపోవడంతో ఎప్పుడేమి జరుగుతుందోనన్న ఆందోళన గ్రామస్థుల్లో నెలకొంది. గత ప్రభుత్వంలో రక్షణ గోడ ఏర్పాటు చేయాలని అధికారులను స్థానికులు కోరినా పట్టించుకోలేదు. కూటమి ప్రభుత్వంలోనైనా రక్షణ గోడ ఏర్పాటు చేయకపోతారా అని స్థానికులు ఆశగా ఉన్నారు.

- పుట్టపర్తి(ఆంధ్రజ్యోతి)



రక్షణ గోడ ఏర్పాటు ఏదీ..?



చెరువు పక్కనే రోడ్డు

సంక్రాంతికి ట్రాన్స్‌ఫార్మర్లు

జిల్లా వ్యాప్తంగా 1800 మంజూరు

సీనియారిటీ ప్రకారం ఏర్పాటు

గ్రామీణ ప్రాంతాలకు 3 ఫేస్ కరెంటు


ఎస్సీ, ఎస్టీకు ఉచితంగా సోలార్ ప్యానెల్స్

విద్యుత్ శాఖ ఎస్ఈ సురేంద్ర



సురేంద్ర, ఎస్ఈ

హిందూపురం అర్బన్, జనవరి 3(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగ నాటికి రైతుల పొలాలకు ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేస్తామని విద్యుత్ శాఖ ఎస్ఈ సురేంద్ర తెలిపారు. హిందూపురంలో ఆయన మాట్లాడుతూ.. జిల్లాకు కొత్తగా 1800 ట్రాన్స్‌ఫార్మర్లు మంజూరయ్యాయని వివరించారు. ఇందులో భాగంగా తొలి విడత 990 ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేస్తామని అన్నారు. హిందూపురం నియోజకవర్గంలో ఈ నెల 9న అందించనున్నట్లు తెలిపారు. హిందూపురం మండలంలో కొత్తగా ఐదు సబ్ స్టేషన్లు ఏర్పాటు చేస్తామన్నారు. జిల్లా వ్యాప్తంగా 1448 గ్రామాలకు త్రీఫేస్ విద్యుత్ అందిస్తామని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పరిశ్రమలు ఏర్పాటుకు అనుకూలంగా ఉంటుందన్నారు. పొలాల్లో విద్యుత్ లేకపోయినా, వైర్లు తెగిపోయినా, ఫ్యూజులు పోయినా రైతులు సొంత ప్రయోగాలు చేయరాదని అన్నారు. సంబంధిత విద్యుత్ లైన్‌మెన్, లైన్ ఇన్‌స్పెక్టర్, ఏఈలకు ఫోన్ చేయాలన్నారు. వారు అందుబాటులోకి రాకపోతే 1912కు కాల్‌చేస్తే అది ఈఈ, ఎస్ఈలకు కూడా అందుతుందన్నారు. సమస్యలు ఉన్న ప్రాంతాలకు వెంటనే అధికారులను పంపి పరిష్కరిస్తామని తెలిపారు. ఎస్సీ, ఎస్టీల ఇళ్లకు ఉన్న ఉచిత విద్యుత్ కనెక్షన్ల స్థానంలో త్వరలో ఉచిత సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేస్తామన్నారు. జిల్లాలో 65,204 ఎస్సీ, ఎస్టీ ఇళ్లు ఉన్నాయని, ఇందులో 30,204 ఇళ్లకు సర్వే చేసి రిజిస్టర్ చేశామన్నారు. మిగిలిన వాటిని కూడా ఈ నెల 10వ తేదీలోపు పూర్తి చేస్తామన్నారు.



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1625.86	1,589.06
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	140	0
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	8,818	0
నీటి నిల్వ (టీఎంసీలు)	79.33	10.26

కడుపుకోత.. పశువులకు మేత!

బళ్లారి గాంధీనగర్, జనవరి 3(ఆంధ్రజ్యోతి): రెండు నెలల క్రితం కిలో రూ.50..60 పలికిన టమోటా ధర... అమాంతం పడిపోవడంతో రైతులకు ఆవేదనే మిగిలింది. వేలాది రూపాయలు ఖర్చు పెట్టి సాగు చేసిన టమోటాకు మార్కెట్‌లో ధర లేకపోవడంతో ఇంటికి తీసుకెళ్ళలేక చెత్తకుప్పలో పడేసిన దృశ్యం బళ్ళారి ఏపీఎంసి మార్కెట్‌లో గురువారం చోటు చేసుకుంది. బళ్లారి చుట్టుప్రక్కల గ్రామాలతో పాటు పొరుగున్న ఉన్న అనంతపురం జిల్లా పరిధిలోని పలు ప్రాంతాల్లో టమోటా పంట భారీగా సాగు చేయడంతో టమోటా భారీగా బళ్ళారి ఏపీఎంసీకి చేరుకుంటోంది. 20కిలోల బాక్సు టమోటా ధర గత నెల రూ 400 నుంచి రూ 500 పలుకగా నేడు బాక్సు ధర రూ.50కు పడిపోయింది. దీంతో కనీసం పెట్టుబడి కూడా చేతికి రాదని టమోటా రైతు కన్నీరు పెడుతున్నారు. చెత్తకుప్పలో పడేసిన టమోటా పశువులకు మేతగా మారిన దృశ్యాలు కనిపించాయి.

రక్తదానం పుణ్యకార్యం

● మాజీ ఎమ్మెల్యే సోమలింగప్ప



సర్టిఫికెట్లు అందజేస్తున్న సోమలింగప్ప

సిరుగుప్ప, జనవరి 3(ఆంధ్రజ్యోతి): ఆపద సమయంలో బాధితులకు రక్తదానం చేయడం ఎంతో పుణ్యకార్యమని మాజీ ఎమ్మెల్యే సోమలింగప్ప అన్నారు. శుక్రవారం తాలుకాలోని టెక్కలకోట పట్టణంలో జీవనిధి ట్రస్టు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిర కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రతి ఒక్కరూ రక్తదానం చేసి ప్రాణాలు కాపాడాలని పిలుపునిచ్చారు. రక్తదానం చేసిన యువకులకు సర్టిఫికెట్లను అందజేశారు. ఈ సందర్భంగా జీవనది ట్రస్టు సంఘం అధ్యక్షుడు లోకేష్, సభ్యులు, యువకులు పాల్గొన్నారు.

ఇసుక టిప్పర్లు స్వాధీనం

బత్తలపల్లి: శ్రీసత్యసాయి జిల్లా బత్తలపల్లి మండలంలోని గరిశన పల్లి వద్ద అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు టిప్పర్లను శుక్రవారం సీజ్ చేసి నట్లు ఎస్‌ఐ సోమశేఖర్ తెలిపారు. వాటిని పోలీస్ స్టేషన్‌కు తరలించామని, దర్యాప్తు చేపట్టామని తెలిపారు.

విలువలతో కూడిన విద్యను అందించాలి

● పిల్లల హక్కులు కాపాడటం అందరి బాధ్యత : రాష్ట్రబాలల హక్కుల పరిరక్షణ కమిషనర్ శశిధర్‌కోశాంబె

బళ్లారి సిటీ, జనవరి 3(ఆంధ్రజ్యోతివ): పిల్లల ఉజ్వల భవిష్యత్తుకు విద్య అనేది గట్టి పునాది అని, విలువలతో కూడిన విద్యను అందించేందుకు విద్యాశాఖ అధికారులు కృషి చేయాలని రాష్ట్రబాలల హక్కులపరిరక్షణ కమిషనర్ శశిధర్‌కోశాంబె సూచించారు. రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ బెంగళూరు, జిల్లాన్యాయసేవల ప్రాధికారసంస పలు శాఖల సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం డిప్యూటీ డైరెక్టర్ హాల్లో ఉచిత నిర్బంధ విద్యపై ప్రగతి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. బాలల హక్కులు కాపాడాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. జిల్లాలో ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు విద్యను అభ్యసనకు అనుబంధంగా రూపొందించాలన్నారు. అనంతరం తొలి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రి బాయి ఫైలే చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బళ్లారి క్షేత్ర విద్యాశాఖాధికారి నయీమూర్ రెహమాన్, సండూర్ క్షేత్ర శిక్షణాదికారి హక్కీ, సిరుగుప్ప ఉగ్రప్ప, జిల్లాప్రాజెక్టు సమన్వయ అధికారి శివలింగారెడ్డితోపాటు విద్యాశాఖ అధికారులు , జిల్లాబాలల పరిరక్షణ సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాల వేళలకు బస్సులు నడపాలి

జిల్లాలోని వివిధ గ్రామాల నుంచి పాఠశాల, కళాశాలలకు వెళ్ళే విద్యార్థుల సమయానికి అనుగుణంగా బస్సులు నడపాలని రాష్ట్ర బాలల కమిషన్ సభ్యుడు శశిధరకోశాంబె రవాణాశాఖ అధికారులకు సూచించారు. బస్సుల రాకపోకల సమస్యకు సంబంధించి రవాణాశాఖ డివిజనల్ కంట్రోలర్ హాల్లో శుక్రవారం రవాణాశాఖ అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం పిల్లల చదువులకు ప్రాధాన్యం ఇస్తోందని, వారి చదువుకు ఎలాంటి ఆటంకం కలగకుండా చూడాలన్నారు. పాఠశాల షెడ్యూల్డ్ ప్రకారం బస్సు రాకపోకలను మార్చాలన్నారు. బాల్యవివాహాలవల్ల కలిగే దుష్పరిమాణాలపై పిల్లల హెల్ప్‌లైన్ నంబరు 1098



సమావేశంలో మాట్లాడుతున్న శశిధర్ కోశాంబె

పిల్లల ఫిర్యాదు-సలహా పెట్టె, స్టిక్కర్‌లేదా బోర్డు రూపంలో పోస్టర్ ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎవరైనా పిల్లలతో బిక్షాటన చేయిస్తే చర్యలు తీసుకోవాలన్నారు. కల్యాణ కర్ణాటక రోడ్డు రవాణా సంస్థ బళ్లారి డివిజనల్ కంట్రోలర్ ఇనాయత్ బాగ్ మాట్లాడుతూ విద్యార్థులకు ప్రత్యేక బస్సులతో ఇబ్బంది లేకుండా చూస్తున్నామన్నారు. శాఖలో సిబ్బంది కొరత ఉందని, శక్తి యోజన అములోకి వచ్చిన నాటి నుంచి సిబ్బంది రెట్టింపుగా పని చేస్తున్నారన్నారు. దీంతో పాటు బస్సు ట్రిప్పుల సంఖ్యను కూడా పెంచినట్లు సమావేశంలో తెలిపారు. ఏయే గ్రామాలకు పాఠశాల విద్యార్థులకు బస్సు సౌకర్యం లేకపోవడంపై సర్వే నిర్వహించి రవాణా, బీఈఓ అధికారులతో సమావేశం నిర్వహించాలన్నారు. పిల్లలకు ప్రత్యేక మరుగుదొడ్లు నిర్మించాలని, తల్లిపాలు ఇచ్చేందుకు ప్రత్యేక గదులు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో డివిజనల్ ట్రాఫిక్ చాయరాజ్, సహాయ ట్రాఫిక్ హేమలత,వీరమ్మ, శివప్రకాస్, గంగాధర్, మంజునాథ్,తిరుమలేష్, లక్ష్మణ్, చంద్రశేఖర్ తదితరులున్నారు.

నైపుణ్యాలతో విజయం సాధించాలి: కలెక్టర్



జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా

బళ్లారి సిటీ,జనవరి 3(ఆంధ్రజ్యోతి):విద్యార్థులు మంచి మార్కులతోపాటు, ఉద్యోగానికి కావాల్సిన నైపుణ్యాలతో విజయం సాధించాలని జిల్లాకలెక్టర్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా అన్నారు. శుక్రవారం నగరంలోని శ్రీమతి సరళాదేవి కళాశాలలో స్కిల్ డెవలప్‌మెంట్ ఎంటర్‌ప్రైజెస్ అండ్ లైవ్లీహుడ్ విభాగం, కర్ణాటక స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ జిల్లా స్కిల్‌మిషన్ సంయుక్తంగా ఏర్పాటు చేసిన ఉద్యోగ మేళా కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు ఉద్యోగాల కోసం కాకుండా, ఉద్యోగాలు ఇచ్చేలా శిక్షణ పొందాలన్నారు. జిల్లాపంచాయతీ ముఖ్య కార్యనిర్వహణాధికారి రాహుల్‌శరణప్ప మాట్లాడుతూ జీవితంలో మంచి సాధకులుగా ఎదగాలంటే కృషి, కమ్యూనికేషన్ స్కిల్స్ , భాషపై మంచి పట్టు అలవరచుకోవాలన్నారు. జిల్లావాణిజ్యమండలి అధ్యక్షుడు యశ్వంత్‌రాజ్ నాగిరెడ్డి మాట్లాడుతూ నిరుద్యోగ సమస్య పరిష్కారానికి ఇలాంటి జాబ్ మేళాలు దోహదపడుతాయన్నారు. ఇలాంటి కార్యక్రమాలకు మా వాణిజ్య బోర్డు ఎప్పుడూ మద్దతు ఇస్తుందని అన్నారు. జాబ్‌మేళా గురించి జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి ప్రాణేశ్ మాట్లాడుతూ మేళాలో 41కంపెనీలు పాల్గొన్నాయన్నారు. 1673 మంది అభ్యర్థులు నమోదు చేసుకున్నారన్నారు. ఈసందర్భంగా కాలేజీ ప్రిన్సిపాల్ మోనికరంజన్, జిల్లా ఉపాది కల్పన కేంద్రం ఉపాది అధికారి హట్టప్ప, ఉపాది హామీ సెల్ కోఆర్డినేటర్ కల్యాణ బసవ, సంచాలకులు విశ్వనాథ్, దేవరాజ్, ప్రాణేశ్, గురుబసప్ప, దుర్గప్ప తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు జపానందస్వామి సాయం



నిత్యావసర సరుకులు అందజేస్తున్న జపానందస్వామి

పావగడ, జనవరి 3(ఆంధ్రజ్యోతి) : ఇటీవల తమిళనాడులో ఫంగల్ తుపానుతో వరదలతో కొట్టుమిట్టాడుత్ను నిరుపేద కుటుంబాలకు పావగడ రామక్రిష్ణ సేవాశ్రమ పీఠాధిపతి జపానందస్వామి ఇన్ఫోసిస్ సంస్థ ఆధ్వర్యంలో సహాయాన్ని అందజేశారు. 450కి.మీ దూరంలో ఉన్న తమిళనాడులోని తిండివనం ప్రదేశం నీటిలో కూరుకుపోయి ఆకలితో కొట్టుమిట్టాడుతున్న 4వేల కుటుంబాలకు ఆసరాగా ఆహారకిట్‌లు, వస్త్రాలు అందించి మానవత్వం చాటుకున్నారు. మానవసేవే మాధవసేవ అని దేశంలోని ఆరు రాష్ట్రాల్లో వరద బాదితులకు ఇప్పటి వరకు 26,500 కుటుంబాలకు సహాయం చేశామన్నారు.

రోబోటిక్ సెంటర్ ప్రారంభం

నంబులపూలకుంట, జనవరి 3(ఆంధ్రజ్యోతి): స్థానిక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో గీర్వాణీ స్వచ్ఛంద సంస్థ ఆధ్వ ర్యంలో ఏర్పాటు చేసిన రోబోటిక్ టెక్నాలజీ సెంటర్‌ను ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ శుక్రవారం ప్రారం భించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ టెక్నాలజీని మంచికే వాడాలి తప్పా.. చెడుకు విని యోగించరాదన్నారు.



మాట్లాడుతున్న రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బసవరాజ్

ఎమ్మెల్యే ఇంటిని ముట్టడిస్తాం

● సమస్యలపై నిర్లక్ష్యాన్ని సహించం : రైతు సంఘం హెచ్చరిక

బళ్లారి సిటీ,జనవరి 3(ఆంధ్రజ్యోతి): తాలూకాలోని కుడితిని చుట్టుప్రక్కల పరిశ్రమల స్థాపనకు అందజేసిన భూములకు పరిహారం చెల్లించాలని లేదంటే ఎమ్మెల్యే ఇంటిని ముట్టడిస్తామని రైతు సంఘం నాయకులు హెచ్చరించారు. శుక్రవారం నగరంలో విలేకరుల సమావేశంలో కర్ణాటక రాష్ట్ర రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు యు.బసవరాజ్ విలేకరులతో మాట్లాడుతూ రైతులు ఇచ్చిన భూముల్లో పరిశ్రమలు స్థాపించాలని, లేదంటే భూములను రైతులకు తిరిగి అప్పగించాలన్నారు. సండూరు ఉప ఎన్నికల్లో రైతు సమస్యలు సందర్భంగా ఈ సమస్యను తదుపరి పరిష్కరిస్తామని ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్నారు. లక్ష్మీ మిట్టల్, ఉత్తమ్ గాల్వ, రైతులకు న్యాయమైన భూమి ధర కోసం రాష్ట్ర ప్రభుత్వం 14సంవత్సరాల క్రితం ఎన్ఎండీసీ కోసం కేఐడీబీ ద్వారా 12,500 ఎకరాల భూమిని సేకరించిందన్నారు. 748రోజులుగా పోరాడుతున్నా నాయకుల్లో చలనం లేదన్నారు. బెళగావి సమావేశాల్లో సమస్యను పరిష్కరిస్తామని సీఎం ఇచ్చినమాటను నిలబెట్టుకోవాలన్నారు. ఈ నెల 9లోగా నిర్ణయం ప్రకటించకపోతే ఎమ్మెల్యే అన్నపూర్ణ ఇంటిని ముట్టడిస్తామన్నారు. సమావేశంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు జె.సత్యబాబు, ఎం తిప్పేస్వామి, శేఖర్, శివరామరెడ్డి, అంజినప్ప, కుడితిని రమేశ్ పాల్గొన్నారు.

గౌరవ వేతనం రూ.15వేలకు పెంచాలి

● 7న రాష్ట్ర వ్యాప్త ఆందోళన: ఆశా వర్కర్లు



పోస్టర్లు విడుదల చేస్తున్న సంఘం సభ్యులు, ఆశా వర్కర్లు

బళ్లారి సిటీ, జనవరి 3(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ఆశా వర్కర్లకు గౌరవ వేతనాలు పెంచుతామని కాంగ్రెస్ మేనిఫెస్టోలో ఇచ్చిన హామీని నెరవేర్చాలని డిమాండ్ చేశారు. శుక్రవారం రాష్ట్ర ఆశా వర్కర్స్ అసోసియేషన్ సంఘం రాష్ట్రకార్యదర్శి నాగలక్ష్మి విలేకరులతో మాట్లాడుతూ నెలవారీ గౌరవ వేతనం రూ. 15,000 పెంచాలని, ఇతర ముఖ్యమైన డిమాండ్‌ల స్నీంటీని నెరవేర్చాలని కోరుతూ జనవరి 7న సమ్మె నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బెంగళూరులోని ఫ్రీడం పార్క్‌లో పోరుబాట నిర్వహిస్తామన్నారు. బెల్గాం శీతాకాల సమావేశాల్లో తమ డిమాండ్లపై మంత్రులు, ఎమ్మెల్యేలకు వినతిపత్రాలిచ్చామని, దీనిపై సమావేశంలో చర్చించినా పరిష్కారం చూపలేదన్నారు. గౌరవ వేతనం , ప్రోత్సహకాన్ని వెంటనే విడుదల చేయాలని, ఆశా వర్కర్లకు స్మార్ట్ ఫోన్లు అందజేయాలని కోరారు. ఇరత పనులకు ఉపయోగించుకోవడం ఆపాలన్నారు. ఆశా వర్కర్లను కార్మికులుగా పరిగణించి కనీస వేతనం, గ్రాట్యుటీ, పీఎఫ్,ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈసందర్భంగా ఏఐయూటీయూసీ సభ్యులు దేవదాసు, డా.ప్రమోద్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామ సొసైటీ ఎన్నికలు ఏకగ్రీవం



అధ్యక్ష, ఉపాధ్యక్షులను సన్మానిస్తున్న సభ్యులు

బళ్లారిరూరల్, జనవరి 3(ఆంధ్రజ్యోతి) : తాలుకాలోని మోకా గ్రామ సొసైటీ అధ్యక్ష, ఉపాధ్యక్ష ఎన్నికలు ఏకగ్రీవంగా ముగివాయి. శుక్రవారం గ్రామ ప్రముఖులు సత్యనారాయణరెడ్డి, మోకా నాగరాజు, వెంకటేష్‌ల ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కొల్లికృష్ణ, ఉపాధ్యక్షుడిగా తిప్పేస్వామిని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో వరాల శ్రీనివాస్, పుడికూరి రంగయ్య, పత్తార్ వెంకటేష్, కావలి నాగరాజు, బీడీహళ్లి రామాంజనేయ, కొంటె మల్లికార్జున, ముత్తప్ప, తిమ్మన్న, వన్నూరప్ప, ఉమాపతి, సన్నీ, గ్రామ ప్రముఖులు పాల్గొన్నారు.

మహిళా విద్యకు సావిత్రి బాయి పూలే ఎనలేని కృషి

● జయంతి సభలో ప్రముఖుల ప్రశంసలు



మాట్లాడుతున్న డాక్టర్ హనుమంతప్ప

బళ్లారి గాంధీనగర్/సిటీ/రూరల్, జనవరి 3(ఆంధ్రజ్యోతి): దేశంలో మహిళలకు చదువుకోనే అవకాశంలేని రోజుల్లో పురుషులతో సమానంగా మహిళలు విద్యావంతులు కావాలని పోరాడిన మహోన్నత స్త్రీమూర్తిగా సావిత్రి బాయి పూలే నిలిచారని, నేడు మహిళలు విద్యావంతులై అన్ని రంగాల్లో రాణిస్తున్నారంటే అందుకు పునాది వేసింది ఆమేనని డాక్టర్ హనుమంతప్ప అన్నారు. శుక్రవారం పూలే 194వ జయంతి పురస్కరించుకుని అఖిల భారత మహిళా సాంస్కృతిక యూనియన్(ఏఐఎంఎస్ఎస్) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. అలాంటి మహనీయురాలిని నేటి మహిళలు ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలన్నారు. ఆనాడు సమాజాన్ని పట్టిపీడిస్తున్న బాల్య వివాహం, వరకట్నం, జాతి తారతమ్యం, మూడనమ్మకాలకు ఎదురొడ్డి పోరాడిన ధీరశాలింగా పూలే చరిత్రకెక్కారన్నారు. ఈ నేపథ్యంలోనే అఖిల భారత మహిళా యూనియన్, జిల్లా సమితి ఆధ్వర్యంలో జనవరి 3 నుంచి 18వ తేదీ వరకు పూలే జయంతి సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఏఐఎంఎస్ఎస్ పదాధికారులు విజయలక్ష్మి, విద్యావతి పాటు కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

తాలూకాలోని సంజీవరాయనకోట ప్రభుత్వ పాఠశాలలో సావిత్రి బాయి పూలే జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. కర్ణాటక రాష్ట్ర యాక్టివ్ టీచర్స్ ఫోరం బళ్లారి జిల్లా యూనిట్ అధ్యక్షుడు రవిచెళ్ల గుర్కి కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు దిల్షాద్‌బేగం, చన్నమ్మ, సుమతి, వైశాలి, శ్వేత, ఉమ్మెహాని, శశమ్మ, రామాంజనేయ,గురుప్రసాద్,విజయ్‌ముంద్రగి, విద్యార్థి ప్రతినిధి కె.అనుష తదితరులున్నారు.

నగరంలోని స్నేహ సంపూట్ సభ ఆవరణంలో సంగనకల్లు విజయ్‌కుమార్ నేతృత్వంలో సావిత్రిబాయి పూలే జయంతిని జరుపుకున్నారు. కాంగ్రెస్ ప్రముఖులు కలకంబ్ల పంపాపతి, సంగనకల్ విజయ్‌కుమార్, జనసైన్య జిల్లా అధ్యక్షుడు స్వామి రఫీక్, రాకేష్, గంగాధర, కప్పగల్ ఓంకార్, లోకేష్, బియ్యం పాటిల్ చంద్రశేఖర్, కట్టేగౌడ హనుమంతు, కళావతి పలువురి యువకులు తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న స్నేహ సంపుట సభ సభ్యులు

హోసూరు జోన్

ముగిసిన డీఎంకే కార్యవర్గ సమావేశం



మాట్లాడుతున్న డీఎంకే నాయకులు

హోసూరు, జనవరి 3(ఆంధ్రజ్యోతి): కృష్ణగిరి పశ్చిమ జిల్లా డీఎంకే జిల్లా అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, నిర్వాహకులు, డిప్యూటీ ఆర్గనైజర్లతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో పశ్చిమ జిల్లా కార్యదర్శి ఎమ్మెల్యే వైప్రకాశ్ పాల్గొన్నారు. పౌర ఆహార సరఫరా శాఖ మంత్రి చక్రపాణి ఆధ్వర్యంలో 174 మందికి చీరలు, పంచెలు, స్వీట్లు, నూతన సంవత్సర క్యాలెండర్ల తోపాటు సంక్రాంతి కానుకలు అందజేశారు. అనంతరం కొత్తగా నియమితులైన పశ్చిమ జిల్లా బృందం సభ్యులతో మాట్లాడారు. ఆర్గనైజర్లు తమ తమ బృందాల తరఫున సంప్రదింపుల సమావేశమయ్యారు. రాబోయే ఎన్నికలకు అందరూ సిద్ధంగా ఉండేలా అవసరమైన పనులు కూడా పూర్తి చేయాలని అన్నారు. తమిళనాడు ప్రభుత్వం సాధించిన విజయాలు, విజన్ ప్రాజెక్టులు, జరుగుతున్న పనులు, చేయాల్సిన పనుల గురించి ప్రజలకు తెలియజేయాలని సూచించారు. అహర్నిశలు శ్రమిస్తున్న తమిళనాడు సీఎం సాధించిన విజయాలను ప్రజల్లోకి తీసుకెళ్లేలా పాటుపడాలన్నారు.

మొక్కలతోనే సంపూర్ణ ఆరోగ్యం

హోసూరు, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): హోసూరు పారిశ్రామిక నగరంగా మారింది. హోసూరులో పైప్‌లైన్లు రక్షణ కల్పించేందుకు రోడ్ల పక్కన మొక్కలు నాటాలని, వాటిని సంరక్షించాలని ప్రజలు కోరుతున్నారు. తమిళనాడులో పారిశ్రామిక అభివృద్ధిలో పురోగమిస్తున్న నగరాల జాబితాలో హోసూరు ఉంది. ఇక్కడ చిన్న, పెద్ద కర్మాగారాలు వందల సంఖ్యలో ఉన్నాయి. కాగా ఇక్కడ కొత్త ఫ్యాక్టరీలు తలెత్తుతున్నాయి. రోడ్లను ప్రారంభించేందుకు పారిశ్రామికవేత్తలు ఆసక్తి చూపుతున్నారు. కావున రోడ్ల పక్కన ఖాళీగా ఉన్న స్థలాల్లో మొక్కలు నాటేందుకు, సంరక్షించేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రస్తుతం తీవ్ర మార్పు వచ్చిందని పలువురు పర్యావరణ ప్రేమికులు అభిప్రాయపడుతున్నారు.



బాగలూరులో రైతులతో ఎమ్మెల్యే వై ప్రకాశ్

రైతులకు నష్టం కలిగిస్తే సహించం

● కొత్త రైలు మార్గంతో భూములు కోల్పోయే ప్రసక్తే లేదు : ఎమ్మెల్యే వై.ప్రకాశ్

హోసూరు, జనవరి 3(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం రూ.23 వేల కోట్లతో బెంగళూరు నుంచి హోసూరు మీదుగా కొత్త సర్క్యులర్ రైలు మార్గాన్ని అమలు చేయబోతోందన్న అంశంలో వాస్తవం లేదని అవి కేవలం ఊహాగానాలేనని, ఇలాంటి ఏ ప్రాజెక్టును తమిళనాడు ప్రభుత్వం అనుమతించబోదని హోసూరు ఎమ్మెల్యే వై.ప్రకాశ్ స్పష్టం చేశారు. హోసూరు శాసనసభ నియోజకవర్గ పరిధిలోని పరిధిలో నల్లూరు, సెవగనపల్లి, ఇచ్చంగూరు, బాగలూరు పంచాయతీలలో కర్ణాటక రాజధాని బెంగళూరు, తమిళనాడులోని హోసూరులను ప్రాంతాలు కలుపుతూ బెంగళూరు సర్క్యులర్ రైల్ లింక్ ప్రాజెక్టు అనే అంశం సోషల్‌మీడియాలో రావడంపై ఎమ్మెల్యే స్పందించారు. దాదాపు 287కిల్లోమీటర్ల మేర అమలు చేయనున్న ఈ ప్రాజెక్టులో తమిళనాడులో 41 కిలోమీటర్ల మేర ప్రాజెక్టును అమలు చేసేందుకు ప్లాన్ చేసినట్లు అందులో ప్రస్తావించారు. భూసేకరణ పనుల్లో భాగంగా డ్రోన్ కెమరాలతో భూమి కొలతలు చేపట్టారని, అధికారికంగా ఎలాంటి ప్రకటన రాకపోవడంతో 500 ఎకరాలకు పైగా వ్యవసాయ భూమి సేకరించి వెయ్యి మందికి పైగా రైతులు నష్టపోతారని ఆ ప్రాంత రైతులు అవాక్కయ్యారు. దీంతో ఆ ప్రాంత రైతులు, ప్రజాప్రతినిధులు హోసూరు ఎమ్మెల్యే, కలెక్టర్‌కు విన్నవించారు. అనంతరం దీనిపై స్పష్టత ఇచ్చేందుకు బాగలూరులో రైతులతో సమావేశం నిర్వహించారు. ఎవరూ భయపడవద్దని, రైతులను ప్రభావితం చేసే ఏ ప్రాజెక్టును తమిళనాడు ప్రభుత్వం ఎప్పటికి అనుమతించబోదని ఆయన స్పష్టం చేశారు. ఇప్పటికే హోసూరు ప్రాంతంలో ఇన్నర్ రింగ్ రోడ్డు, ఔటర్ రింగురోడ్డు, ఎస్‌టీఆర్‌ఆర్ రింగురోడ్డు, సిప్‌కాట్ వంటి అభివృద్ధి కార్యక్రమాల కోసం వ్యవసాయ భూములను సేకరించడంతో రైతులు ప్రాజెక్టుకు వ్యతిరేకంగా ఆందోళనలు చేస్తున్న సంగతి విదితమే.

నీటి మళ్లింపుపై రైతుల ఆగ్రహం

● కంపెనీలకు తరలించడం పట్ల ఫిర్యాదు
● రబీకి కష్టాలు తప్పవని మండిపాటు



శాతవాహన ఫ్యాక్టరీకి నీటిని తరలించడానికి ఏర్పాటు చేసిన మోటార్లు

కంప్లి, జనవరి 3(ఆంధ్రజ్యోతి): తాలుకా పరిధిలోని శ్రీరామరంగాపురం (సుగ్గినళ్లి కొట్టాల్) గ్రామానికి వెళ్లే రామప్ప వాగు నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా రెండు పెద్ద మోటార్లతో శాతవాహన ఇస్పాత్ కంపెనీకి నీటిని మళ్లిస్తున్నారని గ్రామ రైతులు రాఘవేంద్ర, రమేష్ ఆరోపించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇప్పటికే పెద్దపెద్ద కాలువల ద్వారా డిస్ట్రిబ్యూటరీలకు నీరందక రైతులు ఇబ్బందులు పడుతున్నారని, అలాంటిది వాగు ద్వారా వచ్చే నీటికే ఫ్యాక్టరీ యాజమాన్యం పెద్దపెద్ద మోటార్లు ఏర్పాటు చేసి నీరు మళ్లించడం తగదన్నారు. కేవలం ఖరీఫ్‌లో మాత్రం కొంతవరకు వర్షాలు కురవడంతో పొలాల్లో ఎక్కువైన నీరు కూడా వాగుల్లోకి చేరుకోవడంతో కాస్తో కూస్తో నీరు ప్రవహిస్తున్నాయన్నారు. కానీ రబీ పంటలకైతే పూర్తిగా ఇబ్బందులు ఎదుర్కొనేపరిస్థితి నెలకొందన్నారు. అలాంటి సమయంలో ఇలా మోటార్ల ద్వారా కంపెనీలకు నీరు మళ్లించడం తగదన్నారు. ఈ వాగు కింద కొన్ని వందల ఎకరాల్లో మోటార్ల ద్వారా రైతులు పంటలు పండించుకుంటున్నారన్నారు. ముందుకు కూడా ఈ కంపెనీ మోటార్ల ద్వారా నీరు మళ్లిస్తే ఈ ఏడాది రబీ పంటకు నీరందడం కష్టంగా మారుతుందన్నారు. అధికారుల నిర్లక్ష్యం వల్లనే ఈ పరిస్థితి దాపురించిందన్నారు. ఇలాగే కొనసాగితే నిరసనలు చేపడతామని హెచ్చరించారు. ఈ విషయంపై కంప్లి చిన్ననీటి పారుదల శాఖ ఏఈఈ శ్రీనివాస్‌ను వివరణ కోరగా రామప్ప వాగు నుంచి శాతవాహన ఇస్పాత్ కంపెనీ తమ కార్యాలయంలో అనుమతి తీసుకున్నారన్నారు. వర్షపునీరు ఎక్కువగా ప్రవహించే సమయంలో నీటిని మళ్లించుకునేందుకు అనుమతులు ఇచ్చామన్నారు.



ఫిర్యాదు చేసిన రైతులు వీరే..